క్లుప్తంగా

శ్రీ మఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జి


ప్రదక్షిణలు చేస్తున్న జడ్జి జస్టిస్ జోషి

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక హైకోర్టు జడ్జిలు జస్టిస్ జోషి, జ్యోతి ములేమి శనివారం మంత్రాలయం వచ్చారు. ముందుగా వారు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకున్నారు. అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వీరికి శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం కప్పి ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వాదించారు.

ఫెయిత్ హోమ్‌లో అన్నదానం


చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న సీఐ శ్రీరామ్

ఆదోని అర్బన్ : రంజాన్ పండగ సందర్భంగా శనివారం దాత బషీర్‌అహ్మద్ ఆధ్వర్యంలో ఫెయిత్ హోమ్‌లోని చిన్నారులకు త్రీటౌన్ సీఐ శ్రీరామ్ చేతులమీదుగా అన్నదానం చేశారు. సీఐ స్వయంగా భోజనం వడ్డించారు.ఏదైనా సమస్య ఉంటే తనదృష్టికి తీసుకురావాలని, తన సహాయ సహకారాలు అందజేస్తానని ఫెయిత్‌హోమ్ నిర్వాహకులకు సీఐ చెప్పారు. అనంతరం ముస్లిం సోదరులకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

కొనసాగిన ప్రచార భేరి


నిరసన తెలుపుతున్న నాయకులు

కౌతాళం: కేంద్రం అవలంభిస్తున్న ప్రజావ్యరేక విధానాలను నిరసిస్తూ వామ పక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారబేరి కార్యక్రమం శనివారం కొనసాగింది. మండలంలోని సుళేకేరి, మదిరే, పొదలకుంట, హోల్వి గ్రామాల్లో నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ నాయకులు మల్లయ్య, ఈరన్న మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్యులకు అన్యాయం చేస్తుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను బడాబాబులకు కట్టబెట్టేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దెదింపి దేశాన్ని కాపాడుకునేందుకు ఉద్యమించాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు.

ఉపాధి అక్రమాలపై విచారణ చేపట్టాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రామాంజనేయులు

ఆదోని రూరల్ : ఎన్ఐసీ సాంకేతిక మార్పులు చేసిన తర్వాత కొందరు ఉపాధి కూలీలను దోచుకుంటున్నారని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. ఆదోని మండలం కడితోట గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు శనివారం ఆయన వెళ్లి ఉపాధి కూలీలతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతో అనేక సాంకేతిక మార్పులు తీసుకుని వచ్చిందని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు.

రైతన్నకు వర్షం దెబ్బ

వెల్దుర్తి: వర్షం రైతన్నను ఆర్థికంగా దెబ్బ తీసింది. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం తెల్లవారు జాము వరకు ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వానకు సిద్దినగట్టు, లింగాల పల్లె గ్రామాల పరిధిలోని బొప్పాయి తోటలు నేలకొరిగాయి.ఈదురుగాలులకు 50 ఎకరాల్లోని మామిడి పంటకు నష్టం చేకూరింది. దిగుబడులు చేతికొచ్చే దశలో కాయలు నేల రాలిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

తడిసిన ధాన్యం

నందవరం: మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో నదికైరవాడి, గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్న కొత్తిలి, నాగలదిన్నె, నందవరం, గురజాల, రాయచోటి, కనకవీడు తదితర గ్రామాలో రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. చేతికివచ్చిన పంట దిగుబడులు తడిసిపోయాయి. నూర్పిళ్లు, కోతలు చేసుకుని కల్లాల్లో ఆరబోసుకున్న మిర్చి, మొక్కజొన్న, వరి ధాన్యం వర్షార్పణం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

ఆదోని అర్బన్ : మండల కేంద్రం ఆదోనిలో శనివారం రంజాన్ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య సాగాయి. షాయిజామియా మసీదు, ఈద్గాలలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం దీక్షలను ముస్లింలు విరమించారు. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ కొత్తబట్టలు ధరించి మసీదుల్లో భక్తిశ్రద్ధలతో అల్లాహు అని ప్రార్థించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మతగురువులు రంజాన్ పండగ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతిఒక్కరు తన సంపాదనలో కొంతమేర దాన ధర్మాలు చేయాలన్న ఖురాన్ బోధనను పాటించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ముస్లిం మత గురువులు, నాయకులు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా ముస్లింలు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతి ఒక్కరిని ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, ముస్లిం మతపెద్దలు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్ : మండలంలో శనివారం రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. పెద్దపెండేకల్ ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. అలాగే వివిధ గ్రామాల్లో నమాజ్ చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండగ యొక్క విశిష్టతను ముస్లిం మత పెద్దలు వివరించారు.

కౌతాళం: పవిత్ర మాసం రంజాన్ (ఈద్‌ఉల్‌ఫితర్) పండుగను మండల కేంద్రమైన కౌతాళంతో పాటు గ్రామాల్లో ముస్లిం సోదరులు శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నెలరోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు రంజాన్ పండుగతో విరమించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం పరస్పరం అలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తెల్లవారు జామున ఐదు గంటలకు ఫజర్ నమాజ్ తర్వాత ఉదయం 8.30గంటలకు మసీదులకు చేరి తక్బీర్ (అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లాయిలాహా ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్) చదువుకుంటు ఈద్గాకు చేరి సామూహిక ప్రత్యేక ప్రార్థనాలు జరిపారు. సన్మార్గంలో నడిచి అల్లా కృపాకు పాత్రులు కావాలని మత పెద్దలు తెలయజేశారు. అల్లా మార్గంలో ప్రవక్త పద్ధతులను పాటిస్తూ సంపాదించిన మొత్తంలో రెండున్న శాతం జకాత్ రూపంలో ఇవ్వాలని, చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఒక్కొక్కరు 80రూపాయల చొప్పన ఫిత్రా ఇవ్వాలని సూచించారు. స్థానిక ఈద్గాలో ఖాజీసాబు నమాజు విశిష్టత, నమాజు ఆచారించడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ప్రతి ముస్లీం తప్పని సరిగా ఐదు పూటల నమాజు అచరించాలని సూచించారు. జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలోని ఈద్గాలో ప్రత్యేక నమాజులు అచారించారు. దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్తీ భక్తులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

కోసిగి: మండల కేంద్రం కోసిగితోపాటు గ్రామాల్లో శనివారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక జామియా మజీద్, నూరాణి సున్నీ మజీద్, మదీనా మజీద్, మజీదే ఎఆక్సా మజీద్‌ల నుంచి ముస్లిం సోదరులు పురవీధులు గుండా ర్యాలీగా బయలుదేరి రైల్వే గేటు సమీపంలోని ఈద్గా చేరుకున్నారు. అక్కడ మత గురువు జాకీర్ మౌలానా నేతృత్వంలో ప్రత్యేక నమాజ్ పాటించారు. రంజాన్ మాసం ప్రత్యేకను గురువు వివరించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదేవిధంగా రంజాన్‌ను పురస్కరించుకుని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి ఈద్గా దగ్గరకు చేరుకుని ముందుగా మత గురువు జాకీర్ మౌలానాను సన్మానించారు. ముస్లింలకు రంజాన్ శుభకాంక్షలు తెలిపారు.

మంత్రాలయం/మంత్రాలయం రూరల్: మండల కేంద్రం మంత్రాలయంతోపాటు గ్రామాల్లో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానికంగా మత పెద్ద పేష్ ఇమామ్‌ఖాజాబందెనవాజ్ ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా పాతవూరులోని జామీయా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అక్కడి నుంచి రాఘవేంద్రసర్కిల్ మీదుగా మాధవరం రహదారిలోని ఈద్గా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈద్గా వద్ద ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. రంజాన్ ప్రాముఖ్యతను మతపెద్దలు వివరించారు. ఒక్కరికొక్కరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాంపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత వై.సీతారామిరెడ్డి ముస్లిం సోదరులకు ముస్లింలు శుభాకాంక్షలు తెలిపారు.

– ప్రతి ఒక్కరూ సోదర భావంతో నడుచుకోవాలి: పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు

రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థుల స్వామి వారిని కలిశారు. ముందుగా ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కులం, మతం అనే భావం లేకుండా సోదర భావంతో నడుచుకోవాలన్నారు. మండల కేంద్రంలో ముస్లిం సోదరులకు అవసరమైన ఈద్గా ప్రదేశంతో పాటు పలు సమస్యలు నా దృష్టికి తీసుకుని వచ్చారని, వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని పీఠాధిపతి హామీ ఇచ్చారు.

పెద్దకడబూరు : మండల కేంద్రం పెద్దకడబూరుతో పాటు గ్రామాల్లో శనివారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముస్లిం సోదరులు ప్రత్యేక భక్తి గీతాలు ఆలపిస్తూ ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల కేంద్రం పెద్ద కడబూరులో మతగురువు రహిమాన్ మసీద్ నుంచి ఈద్గా దగ్గరకు వెళ్లి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. రంజాన్ ప్రత్యేకతను ఆయన వివరించారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభకాంక్షలు తెలుపుకున్నారు. ఎంపీపీ శ్రీవిద్య, జెడ్పీటీసీ రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు ముస్లిం సోదరులకు రంజాన్ శుభకాంక్షలు తెలిపారు.


ఆదోని జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి రంజాన్ శుభాకాంక్షలు ముస్లిం పెద్దలు


కౌతాళంలో ఖుద్బా చదువుతున్న ఖాజీసాబ్


పెద్దకడబూరులో రంజాన్ ప్రత్యేకతను వివరిస్తున్న మతగురువు రహీమాన్


కుంటనహాల్‌లో నమాజ్‌లో పాల్గొన్న మస్లిలు సోదరులు


కోసిగి ఈద్గా దగ్గర ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


జాతీయ రహదారిపై నమాజ్ చేస్తున్న ముస్లింలు


పెద్ద పెండేకల్లు ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం


మంత్రి గుమ్మనూరు జయరాంను సన్మానించిన బల్లూరు గ్రామస్తులు

ఆలూరు: హాలహర్వి మండలం బల్లూరు గ్రామంలో నిర్వహించనున్న బల్లూరు ఈశ్వరయ్య ఉత్సవాలకు మంత్రి గుమ్మనూరు జయరాంను గ్రామస్తులు ఆహ్వానించారు. శనివారం గ్రామస్తులు శివస్వామి వడియార్, కరిలింగప్ప, సర్పంచ్ మారెన్న, ఎంపీటీసీ సభ్యుడు గాదిలింగప్ప తదితరులు మంత్రి స్వగృహానికి చేరుకుని ఉత్సవాలకు హాజరు కావాల్సిందిగా విన్నవించారు. ఉత్సవాల సందర్భంగా 200 మంది పేద జంటలకు సామూహిక వివాహాలు నిర్వహించనున్నామని, సహకారం అందించాలని కోరారు. తాగునీరు, విద్యుత్, అగ్నిమాపక విపత్తుల నిర్వహణ కేంద్రం అధికారులు సహకారం అందించేలా చూడాలని కోరారు. అనంతరం మంత్రి జయరాంను సన్మానించారు.

వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి


చలో ఢిల్లీ పోస్టర్లను విడుదల చేస్తున్న వాల్మీకులు

ఆదోని టౌన్ : వాల్మీకి, బోయల ఎస్టీ రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని వీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్ డిమాండ్ చేశారు. గత 15 యేళ్లగా ఎస్టీ సాధన కోసం అలుపెరగని పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి పట్టడం లేదని ఆరోపించారు. శనివారం ఆదోని పట్టణంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుభాష్‌చంద్రబోస్ మాట్లాడారు. గత మార్చి 24వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకుల ఎస్టీ జాబితాకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేశారని కృతజ్ఞతలు తెలిపారు. ఎస్టీ జాబితా బిల్లు కోసం కేంద్రంపై ఇకపై పోరాటమేనని చెప్పారు. ఈ మేరకు మే 31వ తేదీన ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టనున్న సంకల్ప దీక్ష పోస్టర్లను విడుదల చేసిన ఆయన విజయవంతం చేయాలని వాల్మీకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంభీంనాయుడు, నాయకులు దేవా, సుధాకర్, వెంకన్న, కిషోర్, లక్ష్మణ్, దస్తగిరినాయుడు, పవన్, సోము, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతి చెందిన రంగనాయకులు

కోడుమూరు: మండలంలోని అల్లినగరం గ్రామానికి చెందిన రంగనాయకులు (36) అనే వ్యక్తి శనివారం రాత్రి రామాపురం బస్ స్టేజీ వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. రంగనాయకులు వెల్దుర్తికి బైక్‌పై వెళ్లి అల్లినగరం గ్రామానికి వస్తుండగా ఏదైనా వాహనం తగిలి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడా? లేక ఎవరైనా గిట్టనివారు హత్య చేశారా? అనే కోణంలో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కోడుమూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించడంతో పాటు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు రంగనాయకులుకు భార్య మంజులతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మద్దిలేటయ్య క్షేత్రంలో భక్తుల సందడి


నరసింహస్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్య క్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం శనివారం భక్తుల సందడి నెలకొంది. ఉభయ కర్నూలు జిల్లాతో పాటు తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. వేకువజామున ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి, వరపూజ నిర్వహించి మొక్కు లు చెల్లించుకున్నారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండా దీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.7,13,433 ఆదాయం వచ్చి నట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామ చంద్రుడు తెలిపారు. డోన్ పట్టణానికి చెందిన గోపాల్‌రెడ్డి, శకుంతల దంపతులు స్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి రూ.1,00, 116 విరాళం అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ నాయుడు, రామచంద్రుడు, హనుమంత్ రెడ్డి, క్రిష్ణారెడ్డి, వెంగళరెడ్డి పాల్గొన్నారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

వెల్దుర్తి/కృష్ణగిరి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలల్లో ఐదవ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఆదివారం పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్దుర్తి, కంబాలపాడు గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు లక్ష్మీప్రసూన, అరుణకుమారి శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదవ తరగతి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

భవితకు భరోసా 'పాలిటెక్నిక్'

- ప్రారంభమైన పాలిసెట్ దరఖాస్తుల ప్రక్రియ
- ఈనెల 30వ తేదీ వరకు గడువు
- మే 10న పరీక్ష, 25న ఫలితాలు
- ఎస్సీ, ఎస్టీవర్గాలకు రూ.100, బీసీ, ఓసీలకు ప్రవేశ పరీక్ష రుసుం రూ.400
- జిల్లాలో ఆరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు
- త్వరలో ఆదోనిలో నూతన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభం



సాదాపురం రోడ్డు సమీపంలో నూతనంగా ఏర్పాటు అయిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, 36 మంది విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎంపికైన విద్యార్థులు

ఆదోని అర్బన్ : పదో తరగతి విద్య తర్వాత ఏదైనా సాంకేతిక విద్యలో నైపుణ్యం సాధించి ఉపాధి పొందాలంటే ఉత్తమ మార్గం పాలిటెక్నిక్. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఇప్పటికే పాలిసెట్ దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్ష ద్వారా అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ ప్రవేశాలు పొందవచ్చు. గ్రామీణ పేద విద్యార్థులు ఇంజినీరింగ్ వంటి అత్యున్నత సాంకేతిక విద్య అభ్యసించడం ఖర్చుతో కూడుకున్నది. వీరికి తక్కువ ఖర్చుతో ప్రాథమికంగా సాంకేతిక విద్య అందిస్తే దానిని పునాదిగా చేసుకుని వారి జీవితానికి బాటలు వేసుకునే అవకాశం లభిస్తుంది. దీనికి పాలిటెక్నిక్ కోర్సులు వేదికగా నిలుస్తాయి. పాలిటెక్నిక్ కోర్సులో చేరి సాంకేతిక విజ్ఞానాన్ని సొంతం చేసుకుని సత్వర ఉపాధి అవకాశాలను పొందవచ్చు. పైగా పాలిటెక్నిక్ పాసైతే బీటెక్ రెండో సంవత్సరంలో నేరుగా చేరవచ్చు. ప్రభుత్వ, ప్రయివేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ, ఎంఈసీ తదితర కోర్సులు అందుబాటులో ఉంటాయి. జిల్లాలో ఆరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, రెండు ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి.

☛ త్వరలో ప్రారంభం కానున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

నాబార్డు నిధుల కింద రూ.6.50 కోట్లతో ఆదోని పట్టణంలోని ఆస్పరి–సాదాపురం గ్రామ సమీపంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల త్వరలో ప్రారంభం కానుంది. 300 మంది విద్యార్థుల కెపాసిటీ గల ఈ కళాశాలలో 25 తరగతి గదులు నిర్మాణం చేపట్టారు. ఈఈఈ, ఈసీఈ గ్రూపులు ఉన్నాయి. ప్రస్తుతం 180 మంది విద్యార్థులు స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదురుగా అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకుంటున్నారు. కళాశాలలో 14 మంది అధ్యాపకులు ఉన్నారు. ఫైనల్ ఇయర్ చదివిన వారిలో క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఇందులో 30 మంది ఆదోని, ఆరుగురు ఆలూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు ఉన్నారు. 30 మందిలో ఈఈఈ గ్రూపు నందు 24 మంది, ఈసీఈ గ్రూపులో ఆరు మంది ఉన్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్, వీల్స్ ఇండియా కంపెనీల క్యాంపస్ డ్రైవ్‌కు ఎంపికయ్యారు.

దరఖాస్తు ఇలా...

- ☛ పాలిసెట్ పరీక్ష రాసేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన వారే అర్హులు
- ☛ దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 30వ వరకు గడువు
- ☛ మే 10న ప్రవేశ పరీక్ష నిర్వహణ – మే 25న ఫలితాల వెల్లడి
- ☛ ఎంట్రాన్స్ రాసేందుకు ఓసీ, బీసీవర్గాల విద్యార్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీవర్గాల వారు రూ.100 చొప్పున ఫీజు చెల్లించాలి.
- ☛ తగినధ్రువీకరణ పత్రాలతో పాలిసెట్ ఏపీ డాట్ ఎన్ఐసీ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఉచితంగా పాలిసెట్ కోచింగ్



పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థుల కోసం ఉచితంగా కోచింగ్ ఏర్పాటు చేశాం. వారికి మెటీరియల్ అందజేస్తున్నాం. కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన ప్రవేశ పరీక్ష పేపర్‌లను కూడా అందజేసి ప్రిపేర్ చేస్తున్నాం. ఎంట్రాన్స్ రాసిన వారికి కళాశాలలో మొదటి ప్రాధాన్యత ఉంటుంది. ఎంట్రెన్స్ రాయని వారికి సీట్లు మిగిలితేనే ఇస్తారు. ఇప్పటిదాకా 2 వేల దరఖాస్తులు వచ్చాయి.

– సుధాకర్‌రెడ్డి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

ప్లేస్‌మెంట్‌లో 24 మంది ఎంపికయ్యారు



ఈ యేడాది ఫైనల్ ఇయర్ ఈఈఈ కోర్సు పూర్తి చేసుకున్న 24 మంది క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఎంపికయ్యారు. గతేడాది ముగ్గురు ఎంపికై ఉద్యోగాలు చేస్తున్నారు. పాలిటెక్నిక్ చేస్తే ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయి.

–రామసుబ్బారెడ్డి, ఈఈఈ ప్లేస్‌మెంట్ అధికారి

చిన్నవయసులో ఉద్యోగాలు



పదో తరగతి పూర్తి అయిన వెంటనే పాలిటెక్నిక్ చేస్తే చిన్నవయసులోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఉన్నత విద్యతోపాటు స్వయం ఉపాధికి తోడ్పడుతుంది. ఈసీఈ నందు ఆరుగురు క్యాంపస్‌లో ఎంపికయ్యారు. గతేడాది ముగ్గురు ఎంపికై ఉద్యోగాలు చేస్తున్నారు. పాలిటెక్నిక్ పూర్తి చేస్తే నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో చేరవచ్చు.

– కిరణ్‌నాయక్, ఈసీఈ ప్లేస్‌మెంట్ అధికారి

నేడు బసవ జయంతి

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని తేరు బజారులో వెలసిన శ్రీబసవేశ్వరుడి ఆలయంలో ఆదివారం స్వామి వారి జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు స్థానిక ఒకటవ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ కామర్తి నాగేషప్ప శనివారం తెలిపారు. స్వామి వారికి ఉదయం అభిషేకం, ఆకు పూజ చేసి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. భక్తులు స్వామి వారి పూజలో పాల్గొని అన్నప్రసాదం పొందాలని సూచించారు.

జనావాసాల్లోకి జింక

ప్యాపిలి: అడవి నుంచి దారి తప్పిన ఓ జింక శనివారం జనావాసాల్లోకి వచ్చింది. పట్టణ సమీపంలోని గుడిపాడు రహదారి మీదుగా కుమ్మరి వీధిలోకి ప్రవేశించిన జింకను స్థానికులు గమనించారు. అయితే అప్పటికే అది కుక్క కాటుకు గురై ఉండటంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. జింకకు ప్రథమ చికిత్స నిర్వహించిన స్థానికులు అటవీశాఖ అధికారుల సూచనల మేరకు అడవిలోకి వదిలేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శివకృష్ణ (22) మృతి చెందాడు. ప్యాపిలికి చెందిన వెంకటేశ్, సుంకురత్నమ్మల కుమారుడు శివకృష్ణ బంధువు హరికృష్ణతో కలసి ద్విచక్రవాహనంపై గుత్తికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో పోతుదొడ్డి వద్దకు రాగానే కేఏ 07 బి 3786 నంబర్ లారీ మామిడికాయల మార్కెట్ నుంచి రోడ్డుపైకి వస్తూ ద్విచక్రవాహానాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో శివకృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా హరికృష్ణకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హరికృష్ణను ఆసుపత్రికి తరలించారు.